# క్రొత్తదారి

= ప్రకాశరావు



"మీ కోసం ఇంతకుముందే ఎవరో వచ్చి వెళ్లారండీ." ప్రొఫెసర్ రావు సాయంత్రం నడకనుండి రాగానే చెవిని వేసింది ఆయన ధర్మపత్ని.

అలవాటు ప్రకారం ఖస్సుమన్నాడు ప్రొ. రా. "అత నెవరో, ఏం పేరో కనుక్కున్నావా? నీ కెన్నిసార్లు చెప్పినా బుద్ధి రాదు."

"అతను చెబితే గదా — ఇప్పుడే వస్తాను అంటూ వెళ్లాడు. కూర్చోమని చెప్పినా వినకుండా, అదుగో అతనే." మూతి ముప్పైవంకలు తిప్పుతూ లోనికి వెళ్లిపోయింది ధ. ప.

గేటు తీసుకునివచ్చిన ఆ ఆగంతకుడు వినయంగా (న) మస్కారం చేసి, కాస్సేపు నసిగి తెగించినవాడిలా అడిగాడు.

"ఫలానా కెమిస్ట్రీ పేపర్లు మీ దగ్గరికే వ...."

ఇక కీ ఇచ్చినట్టుగా విరుచుకుపడ్డారు ప్రొ. రా.

"ఏం? పరీక్షలకు గట్టిగా చదివి రాసుకోనక్కర్లా. అప్పుడు అడ్డగాడిదలా సినిమాలు చూసి, ఇప్పుడు ప్రతి అడ్డమైన గాడిద కాళ్లూ పట్టుకోకపోతే, నే రాసిన

కెమిస్ట్రీ గైడు కొనుక్కుని అఘోరించ లేకపోయావా—ఓ సినిమా మానుకుని''—

మధ్యలోనే అడ్డు తగిలాడు ఆ. ఆ.

''నేను పూర్తిగా మనవి చేసుకోలేదు సార్. నేను ఎం.ఎస్‌సీ. పరీక్షలు క్రిందటేడే రాశాను ఇప్పుడు కెనడాలో సీటు వచ్చి పీ.ఎచ్.డీ. కి వెళ్తున్నాను. అనుకోకుండా పెద్ద బెడద వచ్చిపడింది సార్— మీరే ఆదుకోవాలి. నా పెళ్ళి నిశ్చయం చేశారు మా వాళ్లు. ఆ అమ్మాయి తండ్రే నా చదువు ఖర్చులన్నీ భరిస్తున్నాడు. ఆ అమ్మాయి ఇప్పుడు ఎం.ఎస్‌సీ. పరీక్ష రాసింది. ఆ సంగతే మాట్లాడుతున్నాను సార్. మీరు దయదల్చి ఆమెను ఫెయిల్ చెయ్యాలి.''

''ఏమిటీ?' ఇలాటి కేసు ఎప్పుడూ తగల్లేదు ప్రొ. రా. కు. తప్పుగా విన్నాననుకున్నాడు.

''అదే సార్! ఆమె పాస్ అయితే కూడా తీసుకెళ్లాల్సి వుంటుంది; ఫెయిల్ అయితే—చదువు పూర్తి చేసుకో. అని చెప్పి నేనొక్కడినే వెళ్లిపోవచ్చు. మీరు ఆమె పాస్ అయేలా వుంటే ఫెయిల్ చేయమనడంలేదు. కాని, ఆడపిల్ల అని జాలితో ఫెయిల్ అయేలా వున్నా పాస్ చేయకుండా వుంటే చాలు. మీరు తప్ప ఎవ్వరూ రక్షించలేరు సార్ నన్ను. ఆమె నెంబరు పధ్నాలుగు వందల ఇరవై. కొంచెం దయవుంచండి....''

''వెధవ'', అనుకున్నాడు ప్రొ. రా. ''ఆ అమ్మాయి డబ్బుతో ఫారిన్ వెళ్తాడూ—ఆమెమాత్రం అక్కర్లేమా! రాస్కెల్, అటు దాటుకుని ఇటు కట్టుకున్న దానికి మొండిచేయి చూపించేలా వున్నాడు. వీడి వాలకం చూస్తే స్కౌండ్రల్.''

ఆ పధ్నాలుగు వందల ఇరవై పేపరును మూడవసారి అటూ ఇటూ తిప్పి పక్కకు నెట్టాడు ప్రొ. రా. ధ. ప ఇచ్చిన పాలు అందుకుని గటగటా తాగేశాడు. ఎంత లిబరల్‌గా వున్నా సదరు పేపరుకు పదిహేను కంటే ఎక్కువ మార్కులు రావు. కాని ఆపదలో వున్న ఒక అమాయకురాలిని రక్షించడం తన ధర్మం. ఆ దుర్మార్గుడి ప్లాను పారకుండ చూడడం తన విధి.

ఆ పేపరందుకుని ఏభై ఐదు మార్కులిచ్చి మిగతా వాటిమీద పడ్డాడు.

* * *

''నమస్కారం సార్!'' వినయంగా లేచి నుంచున్నాడు ప్రొ. రా. డ్రాయింగ్ రూంలోకి రాగానే.

''ఎక్కడో చూసినట్టుందే ఈ మొహం'' అనుకున్నాడు ప్రొ. రా.

''చాలా థాంక్స్ సార్. మీ పుణ్యమా అని గట్టెక్కాను ఈ ఏడు. చాలా దండయాత్రల తర్వాత! మీ దగ్గర మామూలు పప్పు ఉడకదని తెలిసి కొత్తప్లాను వేశాను. నా నెంబరే పధ్నాలుగువందల ఇరవై.''....

''నాలుగువందల ఇరవై' అనుకున్నాడు తెల్లబోయిన ప్రొ. రా. చేతిలో ఆ ఆ పెట్టిన మిఠాయిడబ్బా గట్టిగా పట్టుకుని అతడు పోయిన వేపే చూస్తూ